క్లుప్తంగా

సీఎస్ శాంతికుమారికి వినతి



సీఎస్ శాంతికుమారికి వినతిపత్రం అందిస్తున్న ఉద్యోగులు

సూర్యాపేట : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న జనరల్, వొకేషనల్ అధ్యాపకులను కూడా క్రమబద్ధీకరించాలని కోరుతూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి ఆదివారం సూర్యాపేట జిల్లాకేంద్రంలో పలువురు ఉద్యోగులు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో గునగంటి వెంకటేశ్వర్లు, కర్నాటి శ్రీనివాస్, భాస్కర్, సైదులు, పున్నమ్మ, అరవింద్, రాణి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శివగంగ యాదవ సంఘం ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం కాసర్లపహాడ్‌లో శివగంగ యాదవ సంఘం నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొల్లం లింగస్వామి, ఉపాధ్యక్షుడిగా ఉగ్గం లక్ష్మణ్, కోశాధికారిగా మంచాల రమేష్, డైరెక్టర్లుగా కంపసాటి వీరయ్య, బొల్లం అశోక్, ఉప్పుల అనిల్, గైగుళ్ల వెంకన్న, పస్తాల సోమయ్య, మంచాల ఓదేలు, పెద్ద బోయిన అవిలమ్మ, రాజబోయిన అవిలమ్మ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో పస్తాల వీరమల్లు, బొల్లం నర్సయ్య, కంపసాటి లింగయ్య, గైగుళ్ల లింగయ్య, గుడిసె అంజయ్య, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అంజన్నకు నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

తిరుమలగిరి : ప్రజానాట్య మండలి ఉమ్మడి నల్లగొండ జిల్లా మాజీ అధ్యక్షుడు కారుపోతుల అంజన్న 28వ వర్ధంతిని తాటిపాముల గ్రామంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంజన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. భూస్వామ్య పెత్తందారి వ్యవస్థపై పోరాటాలు చేశారని, అక్షరాస్యత ఉద్యమంలో ప్రజలను చైతన్యపరిచిన గొప్ప వ్యక్తి అంజన్న అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కడెం లింగయ్య, ఉప్పలయ్య, వెంకటయ్య, సోమయ్య, ఎర్ర యాదగిరి, నాయిని కృష్ణ, సజ్జన్‌కుమార్, రాజన్న, రమేష్, అశోక్, వెంకటయ్య, రాజు, యాకస్వామి తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పించాలి

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో కనీస సౌకర్యాలు కల్పించాలని విద్యార్థులు ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడారు. తమకు సరిపడా గదులు లేకపోవడంతో హాస్టల్ గదిలోనే తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గదుల్లో ఫ్యాన్లు కూడా లేవని, భోజనం అందించడంలో మెనూ పాటించడం లేదన్నారు. ఈవిషయంపై ప్రిన్సిపాల్ మురళీని వివరణ కోరగా.. ప్రస్తుత విద్యాసంవత్సరానికి ఏజెన్సీలకు టెండర్ రాకపోవడంతో మెనూ అందించలేకపోతున్నట్లు తెలిపారు. మరో రెండు రోజుల్లో ఏజెన్సీల నియామకం జరుగుతుందన్నారు. ఇంటర్ విద్యార్థులూ ఉండడంతో గదులు సరిపోవడం లేదని తెలిపారు. నూతన గదుల నిర్మాణం పూర్తికాగానే సమస్యలు పరిష్కారమవుతాయని తెలియజేశారు.

మిత్రమండలి సేవలు అభినందనీయం



చీరలు పంపిణీ చేస్తున్న శ్రీనివాసనాయుడు

కోదాడ రూరల్ : స్వర్గీయ గాలి రమేష్‌నాయుడు మిత్ర మండలి ఆధ్వర్యంలో చేపడుతున్న సేవలు అభినందనీయమని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల నాయకులు అన్నారు. రమేష్ నాయుడు 34వ వర్ధంతి సందర్భంగా ఆదివారం పట్టణంలోని హుజూర్‌నగర్ రోడ్డులో 300 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 33 ఏళ్లుగా మిత్రమండలి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అన్నదానాలు, రక్తదానాలు, విద్యార్థులకు నోటు బుక్స్, కరోనా కాలంలో నిత్యావసర వస్తువుల పంపిణీ చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు గాలి శ్రీనివాసునాయుడు, బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణ, మైనార్టీ అధ్యక్షుడు ఎస్‌కె.బాజాన్, ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు భుక్య రవినాయక్ పాల్గొన్నారు.

దోమల నివారణ చర్యలేవి..!

- ఫాగింగ్ చేయడంలో అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం
- అస్తవ్యస్తంగా డ్రెయినేజీలు
- పెరుగుతున్న దోమలు



రామచంద్రపురంలో పూడిన డ్రెయినేజీ



కుక్కడంలో..

మద్దిరాల : మండల పరిధిలోని గ్రామాల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. డ్రెయినేజీలు సరిగాలేక పోవడంతో మురుగు నీరు ఇళ్ల మధ్యే నిలుస్తోంది. దీంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. సాయంత్రం కాగానే దోమల వల్ల ఇళ్లలో ఉండలేకపోతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలు గ్రామాల్లో డ్రెయినేజీలు పూర్తిగా పూడిపోయాయి.

ఫాగింగ్ చేయడంలో నిర్లక్ష్యం..

గతంలో అన్ని గ్రామాల్లో సాయంత్రం సమయాల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేసేవారు. కానీ ఇప్పుడు ఫాగింగ్ చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. ఫలితంగా దోమలు విపరీతంగా వ్యాప్తి చెందుతూ ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఈ దోమల కారణంగా విష జ్వరాలు ప్రబలుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వైద్యాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామాల్లో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కరెంట్ పోతే ఇళ్లలో ఉండలేకపోతున్నాం



దోమల నివారణకు ప్రభుత్వం గ్రామాల్లో ప్రత్యేక చర్యలను చేపట్టాలి. గ్రామాల్లోని డ్రెయినేజీలు చాలా వరకు పూడిపోయాయి. దీంతో మురుగు నీరు చేరి దోమలు విపరీతంగా వ్యాప్తిచెందుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి డ్రెయినేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలి. కాలువల్లో క్రిమిసంహారక మందులను పిచికారీ చేయించాలి.

- మద్దెల భిక్షపతి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు, కుక్కడం

రోజూ సాయంత్రం ఫాగింగ్ చేయాలి



ఇటీవల కురిసిన వర్షాలకు వీధుల్లో, ఇళ్ల మధ్య వర్షపు నీరు చేరి దోమలకు నిలయంగా మారాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దోమల వల్ల విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉంది. అధికారులు దోమల నివారణ చర్యలను చేపట్టాలి. ప్రతి రోజూ సాయంత్రం ఫాగింగ్ నిర్వహించాలి. ఇళ్ల మధ్య, వీధుల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించాలి.

- కోడి కుమార్‌యాదవ్, గోరెంట్ల

ఎస్సారెస్పీ కాలువకు బీఎన్‌రెడ్డి పేరు పెట్టాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నాగారం : శ్రీరామ్‌సాగర్ రెండవ దశ కాలువకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, ఎంసీపీఐయూ పొలిట్‌బ్యూరో సభ్యుడు భీంరెడ్డి నరసింహారెడ్డి పేరు పెట్టాలని కోరుతూ ఎంసీపీఐయూ ఆధ్వర్యంలో ఆదివారం తిరుమలగిరిలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వరికుప్పల వెంకన్న, వి.మట్టయ్య మాట్లాడారు. భీంరెడ్డి నరసింహారెడ్డి ఈ ప్రాంత అభివృద్ధి కోసం పరితపించి, గోదావరి జలాలు అందించేందుకు కృషి చేశారని అన్నారు. శ్రీరాంసాగర్ కోసం అహర్నిశలు కృషిచేసిన బీఎన్‌రెడ్డి పేరును ఎస్సారెస్పీ 2వ దశ కాలువలకు పెట్టాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంసీపీఐయూ నాయకులు షేక్ నజీర్, సైదమ్మ, పోతుగంటి కాశీ, గోపి, భరత్, కిరణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వామపక్ష నాయకుల అరెస్టు హేయమైన చర్య



తుంగతుర్తిలో మాట్లాడుతున్న పేర్ల నాగయ్య

తుంగతుర్తి : సీఎం కేసీఆర్ సూర్యాపేట జిల్లా పర్యటన నేపథ్యంలో పోలీసులు ముందస్తు చర్యలో భాగంగా సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్, ఇతర వామపక్ష పార్టీల నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయడం హేయమైన చర్యని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కమిటీ సభ్యుడు పేర్ల నాగయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని దుబ్బాక సంజీవరెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఏం ప్రగతి సాధించారని ప్రగతి నివేదన సభ పెడుతున్నారని ప్రశ్నించారు. సభలో ప్రభుత్వ అసమర్థత బయట పడుతుందనే భయంతోనే అక్రమంగా అరెస్టులు చేస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కమిటీ సభ్యులు గొడ్డలి నర్సయ్య, వేర్పుల లక్ష్మయ్య, దొంతమళ్ల రాములు, నల్లగంటి సుగుణమ్మ, పరశురాములు, నారాయణ, మద్దెల మైసయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు



తిరుమలగిరిలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

తిరుమలగిరి : మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం తిరుమలగిరిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వై.నరేష్, పట్టణశాఖ అధ్యక్షుడు పేరాల వీరేష్, జమ్మిలాల్, అంబేద్కర్, అమరేందర్ రెడ్డి, ఎండీ.హఫీజ్, భాస్కర్, రామోజీ, మల్లయ్య, రాములు, లింగయ్య, కృష్ణ, నాగరాజు, అశోక్, సజన్, విశ్వేశ్వర్, వంశీ, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



నూతనకల్‌లో..

రాజీవ్ ఆశయ సాధనకు కృషి చేయాలి

నూతనకల్ : మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి అన్నారు. రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను పురస్కరించుకొని ఆదివారం మండల కేంద్రంలో కేక్ కట్‌చేశారు. రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బొడ్డుపల్లి అంజయ్య, తీగల గిరిధర్‌రెడ్డి, కట్టా మల్లారెడ్డి, బండపల్లి సాగర్, నెల్లుట్ల మహేష్, ఇమ్మారెడ్డి దయాకర్‌రెడ్డి, కందుకూరి శ్రీకాంత్, దండుగుల లింగయ్య, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు కంటి వైద్యశిబిరం

భానుపురి : రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం కార్యాలయంలో సోమవారం వరంగల్‌కు చెందిన శరత్ మ్యాక్సీవిజన్ లేజర్ కంటి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు దండా శ్యాంసుందర్‌రెడ్డి, సుధగాని నాగేశ్వర్‌రావు ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని పెన్షనర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిరుపయోగంగా భవనం



నిరుపయోగంగా ఉన్న రెండంతస్తుల భవనం

అర్వపల్లి : అర్వపల్లిలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్మించిన సంఘమిత్ర కార్యాలయ భవనం కొన్నేళ్లుగా నిరుపయోగంగా మారింది. రెండంతస్తులలో ఈభవనాన్ని అన్ని వసతులతో నిర్మించారు. అయితే 2006లో అప్పటి ఎమ్మెల్యే రాంరెడ్డి దామోదర్‌రెడ్డి ఈ సంఘమిత్ర భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో ఒక అంతస్తులో భవనాన్ని నిర్మించారు. ఇందులో సంఘమిత్ర కార్యాలయం, ఉపాధిహామీ కార్యాలయాలను నడిపించారు. అయితే భవనం చాలకపోవడంతో 10ఏళ్ల కిందట ఈ భవనంపై రెండో అంతస్తు నిర్మాణం కూడా చేపట్టారు. ఈక్రమంలోనే ప్రభుత్వం అప్పట్లో స్త్రీశక్తి భవనాలను కొత్తగా నిర్మించింది. అందులో భాగంగానే ఈ భవనం పక్కనే ఇక్కడ కూడా స్త్రీశక్తి భవన నిర్మాణం జరిగింది. ఈ భవన నిర్మాణం జరిగాక కొత్త భవనంలోకి ఉపాధిహామీ కార్యాలయం, సంఘమిత్ర కార్యాలయం రెండింటిని మార్చారు. అప్పటి నుంచి పాత సంఘమిత్ర భవనం నిరుపయోగంగా ఉంటుంది. ఏదైనా ప్రభుత్వ కార్యాలయాల కోసం ఈ భవనాన్ని వినియోగించాలని పలువురు కోరుతున్నారు.

కొత్త అంబులెన్స్‌లు వచ్చేశాయ్

- తుంగతుర్తి నియోజకవర్గానికి నాలుగు కొత్త అంబులెన్స్‌లు
- పాతవాహనాలకు కాలం తీరిపోవడంతో కొత్తవి ఏర్పాటు
- అత్యవసర సమయాల్లో తీరనున్న ప్రజల ఇబ్బందులు



అర్వపల్లిలో కొత్తగా ఏర్పాటు చేసిన అంబులెన్స్

అర్వపల్లి : అత్యవసర సమయాల్లో ప్రజలను ఆదుకునే 108 అంబులెన్స్‌లు కాలంచెల్లి మొరాయిస్తుండటంతో సకాలంలో వైద్యసేవలు అందక తుంగతుర్తి నియోజకవర్గ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అయితే ఈ ఇబ్బందులు తీర్చడం కోసం ప్రభుత్వం కొత్త అంబులెన్స్‌లను ఏర్పాటు చేసింది. 2017 డిసెంబర్‌లో నియోజకవర్గానికి కేటాయించిన నాలుగు 108 అంబులెన్స్‌లు తరచూ రిపేర్లకు గురవుతూ మొరాయిస్తున్నాయి. ఫలితంగా ఆపదలో ఉన్న వారికి సకాలంలో వైద్యసేవలు అందించలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఈ పరిస్థితుల దృష్ట్యా నాలుగు కొత్త వాహనాలను ఏర్పాటు చేశారు. దీంతో ఆపదలో ఉన్న ప్రజల కష్టాలు తీరనున్నాయి.

తుంగతుర్తి నియోజకవర్గంలో ఇలా..

తుంగతుర్తి నియోజకవర్గంలో మోత్కూరు, అర్వపల్లి, నూతనకల్, శాలిగౌరారం కేంద్రాలుగా నియోజకవర్గ వ్యాప్తంగా నాలుగు అంబులెన్స్‌లు సేవలందిస్తున్నాయి. ఇప్పటివరకు ఉన్న నాలుగు అంబులెన్స్‌లు పాతవి కావడంతో వాటిని తొలగించి కొత్త వాహనాలను ఇటీవల ఏర్పాటు చేశారు. ఈ కొత్త వాహనాలు ఆయా మండలాలకు వచ్చాయి. ఒక్కో వాహనం సుమారు రూ.13లక్షలు వెచ్చించి ఏర్పాటుచేశారు. మోత్కూరుకు కేటాయించిన వాహనం మోత్కూరు, ఆత్మకూరు(ఎం) మండలాలకు, అర్వపల్లికి కేటాయించిన వాహనం తుంగతుర్తి, తిరుమలగిరి, జాజిరెడ్డిగూడెం, నాగారం మండలాలకు, నూతనకల్‌కు కేటాయించిన వాహనం నూతనకల్, మద్దిరాల, ఆత్మకూర్(ఎస్)మండలాలకు, శాలిగౌరారంనకు కేటాయించిన వాహనం అదే మండలానికి సేవలందిస్తున్నాయి. కొత్త వాహనాల రాకతో ఆపదలో ఉన్న వారికి మరింత నాణ్యమైన వైద్యసేవలు అందనున్నాయి.

సకాలంలో వైద్యసేవలు అందుతాయి



పాత అంబులెన్స్‌లకు కాలం తీరిపోవడంతో ఆపదలో ఉన్న వారి వద్దకు సకాలంలో చేరడం కొంత ఇబ్బంది అయ్యేది. ఇప్పుడు కొత్త వాహనాలు రావడంతో ఆ ఇబ్బందులు తీరి సకాలంలో వైద్యసేవలు అందనున్నాయి. అంబులెన్స్‌ల సేవలతో పైలెట్‌గా ఐదుసార్లు ఉత్తమ అవార్డు పొందాను.

- వల్లాల సత్యనారాయణ, 108 అంబులెన్స్ పైలెట్

ఇబ్బందులు తీరాయి



నియోజకవర్గ వ్యాప్తంగా పాత అంబులెన్స్‌లను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయడంతో ఇబ్బందులు తీరాయి. నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు కొత్త వాహనాలు రావడం హర్షణీయం. కొత్త అంబులెన్స్‌ల వల్ల తొందరగా వెళ్లి సేవలందిస్తున్నాం.

- తంగెళ్ల నిరంజన్, ఈఎంటీ

ముదిరాజ్‌లకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలి



సమావేశంలో పాల్గొన్న ముదిరాజ్ నాయకులు

ఆత్మకూర్ (ఎస్) : రానున్న ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు 15 శాతం జనాభా ఉన్న ముదిరాజ్‌లకు ప్రతి జిల్లాలో ఒక ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ మండల కార్యదర్శి నీలం క్రిష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం నెమ్మికల్లులో నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని రంగాల్లో వెనకబడిన ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏకు మార్చాలన్నారు. ఈ కార్యక్రమంలో మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు జంగా వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి గంగరబోయిన శ్రీనివాస్, కోలా కరుణాకర్, సారగుండ్ల వెంకన్న, లక్ష్మీనర్సు, నాయిని సైదులు, శ్రీను, కిరణ్, మల్సూర్, రమేష్, లింగయ్య, మధు, హరీష్, బాబు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నాటుతున్నారు.. నరుకుతున్నారు



అనంతారం క్రాస్ రోడ్డులో విద్యుత్ తీగల కింద నరికి పడేసిన హరితహారం చెట్లు

- రోడ్ల వెంబడి విద్యుత్ తీగల కింద హరితహారం మొక్కలు
- చెట్లు తీగల ఎత్తుకు పెరగగానే నరికేస్తున్న విద్యుత్‌సిబ్బంది
- నిష్ప్రయోజనం అవుతున్న హరితహారం

పెన్‌పహాడ్ : అధికారుల తప్పిదాలతో హరితహారం అభాసుపాలవుతోంది. రోడ్ల వెంట ఉన్న విద్యుత్ తీగల కింద మొక్కలు నాటడంతో అవి కాస్త పెరగగానే విద్యుత్ అధికారులు తప్పనిసరి పరిస్థితుల్లో నరుకుతున్నారు. పెన్‌పహాడ్ మండలంలోని 29 గ్రామ పంచాయతీల పరిధిలో నర్సరీలు ఏర్పాటు చేసి మొక్కలు పెంచి నాటుతున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. మొక్కలకు ఎలాంటి అడ్డంకులు లేని స్థలాల్లో నాటాల్సి ఉంది. కానీ రోడ్ల వెంట ఉన్న విద్యుత్ తీగల కింద నాటడంతో అనేక సమస్యలు తలెత్తున్నాయి. నాటిన మొక్కలను తప్పని పరిస్థితుల్లో నరకాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. నరికిన చోటే మళ్లీ కొత్త మొక్కలు నాటడం విడ్డూరం. అయితే మొక్కలను అధికారులు లెక్కల కోసం నాటుతున్నారా..? లేక సంరక్షణ కోసం నాటుతున్నారా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఏటా మండల వ్యాప్తంగా లక్షలు వెచ్చించి నర్సరీల్లో మొక్కలు పెంచి వాటిని రెండు, మూడు నెలల పాటు సంరక్షించి ఎన్ఆర్ఈజీఎస్ కూలీలతో నాటిస్తారు. కానీ రోడ్ల వెంట విద్యుత్ తీగల కింద మొక్కలు నాటడంతో ఈదురు గాలులకు చెట్లు విరిగి విద్యుత్ తీగలపై పడుతున్నాయి. దీంతో విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయి. పలు చోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపోతున్నాయి. దీంతో విద్యుత్ సిబ్బంది రోడ్ల వెంబడి తీగల వెంట ఉన్న చెట్లను తొలగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు హరితహారం మొక్కలను అనువైన స్థలాల్లో నాటి సంరక్షించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సమస్యలు తలెత్తకుండా చూస్తాం



హరితహారంలో భాగంగా హరితహారం మొక్కలను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రోడ్డుకు ఇరువైపులా నాటాం. దీని వల్ల కొన్ని చోట్ల చెట్లు విద్యుత్ తీగలకు అడ్డంకిగా మారాయి. ఇకపై విద్యుత్ తీగల కింద తక్కువ ఎత్తు పెరిగే మొక్కలు నాటేలా చర్యలు తీసుకుంటాం.

- బాణాల శ్రీనివాస్, ఎంపీడీఓ

నూతన కార్యవర్గం ఎన్నిక

కోదాడరూరల్ : పట్టణ పరిధిలోని కేఎల్‌ఆర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మల్లెబోయిన సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా ఓరుగంటి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా గంధం శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీగా పాలిశెట్టి నవీన్, కోశాధికారిగా కనకదుర్గ, కల్చరల్ సెక్రటరీగా సతీశ్‌తో పాటు ఏడుగురిని డైరెక్టర్‌లుగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా పాలేటి నాగేశ్వరరావు, బోళ్ల సైదిరెడ్డి వ్యవహరించారు.

- ఘనంగా బోనాల పండుగ



పెన్‌పహాడ్ : మండల కేంద్రంలో ఆదివారం ముత్యాలమ్మ పండుగ సందర్భంగా బోనాలతో ర్యాలీగా వెళ్తున్న గ్రామస్తులు

పలు పార్టీలు, సంఘాల నాయకుల ముందస్తు అరెస్టు



సూర్యాపేటలో పటేల్ రమేష్‌రెడ్డిని గృహ నిర్బంధంలో ఉంచిన పోలీసులు



సూర్యాపేటలో అరెస్టయిన సంకినేని వరుణ్‌రావు



తిరుమలగిరి పోలీస్ స్టేషన్‌లో నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



తుంగతుర్తి : అరెస్టయిన కాంగ్రెస్ నాయకులు

భానుపురి / దురాజ్‌పల్లి : సూర్యాపేటలో ముఖ్యమంత్రి పర్యటనను అడ్డుకుంటామని ప్రకటించిన నేపథ్యంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డిని పోలీసులు ఆదివారం హౌజ్ అరెస్టు చేశారు. అలాగే పలువురు ముఖ్య నాయకులను ముందస్తుగానే అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ముఖ్యమంత్రి పర్యటన ముగిసిన అనంతరం వదిలేశారు. ఈ సందర్భంగా పటేల్ రమేష్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందన్నారు. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థా.. రాచరిక వ్యవస్థా అని ప్రశ్నించారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ప్రారంభానికి ప్రొటోకాల్ ప్రకారం హాజరు కావాల్సిన 48వ వార్డు కౌన్సిలర్‌ను అర్ధ రాత్రి 1గంటకే అరెస్టు చేయడం ఏమిటన్నారు.

బీజేపీ నాయకుల హౌజ్ అరెస్టు..

సీఎం పర్యటన నేపథ్యంలో బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంకినేని వరుణ్‌రావును పోలీసులు ఆదివారం ముందస్తుగా హౌజ్ అరెస్టు చేశారు. ముఖ్యమంత్రి సభ ముగిసే వరకు బయటికి రానివ్వకుండా నిర్బంధించారు. అలాగే వామపక్ష పార్టీలు, అనుబంధ సంఘాల నాయకులను ఎక్కడిక్కడ అరెస్టు చేసి స్థానిక పోలీసు స్టేషన్లకు తరలించారు.

తిరుమలగిరి : సూర్యాపేటలో ఆదివారం జరిగే ప్రగతి నివేదన సభకు సీఎం కేసీఆర్ వస్తున్న సందర్భంగా ముందస్తుగా కాంగ్రెస్ పార్టీ నాయకులను స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ఎల్సోజు నరేష్ మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడాన్ని ఖండించారు. ఈ కార్యక్రమంలో పట్టణ శాఖ అధ్యక్షుడు పేరాల వీరేష్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు కందుకూరి అంబేద్కర్, జుమ్మిలాల్, అమరేందర్‌రెడ్డి, మల్లయ్య, విశ్వేశ్వర్, వంశీ, ఉపేందర్ పాల్గొన్నారు.

తుంగతుర్తి : సూర్యాపేటలో జరిగే సీఎం కేసీఆర్ ప్రగతి నివేదన సభను అడ్డుకునేందుకు వెళ్తున్న కాంగ్రెస్, బీజేపీ నాయకులను పోలీసులు తుంగతుర్తిలో ఆదివారం ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్, బీజేపీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో నియంత, నిరంకుశ పాలన సాగుతుందన్నారు. అరెస్టయిన వారిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్దబోయిన అజయ్, ఉప్పుల రాంబాబు, వెంకన్న, అబ్దుల్, కరీం, శ్రీను, నరేష్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేపాక సాయిబాబు, పులిపంపుల సైదులు, నరేష్, సత్యం, నాయకులు, తదితరులు ఉన్నారు.

చివ్వెంల : ముఖ్యమంత్రి కేసీఆర్ సభను అడ్డుకుంటామని వివిధ పార్టీల నాయకులు ప్రకటించడంతో పోలీసులు వారిని ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కొంతమంది సూర్యాపేట టౌన్ పోలీస్ స్టేషన్, మరికొంత మందిని సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్, కొందరిని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో లంబాడీ విద్యార్థి సేనా రాష్ట్ర అధ్యక్షుడు ధరావతు బాలు నాయక్, జన సమితి మండల యూత్ అధ్యక్షుడు ధరావతు సుమన్ నాయక్ తదితరులు ఉన్నారు.

అర్వపల్లి : సూర్యాపేటలో జరిగే సీఎం కేసీఆర్ పర్యటనను విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం అడ్డుకోవాలని పీడీఎస్‌యూ పిలుపునివ్వడంతో ముందస్తుగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పోలెబోయిన కిరణ్‌ను ఆదివారం స్థానిక పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడారు. 9 ఏళ్లుగా అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించిందని చెప్పారు.

పెన్‌పహాడ్ : మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడం అప్రజాస్వామికమని పలువురు కాంగ్రెస్ శ్రేణులు అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మామిడి శ్రీనివాస్, సామ సురేందర్‌రెడ్డి, సురభి వెంకటేశ్వర్లు, నర్సిరెడ్డి, బలరాం నాయక్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్ (ఎస్) : సూర్యాపేటలో బీఆర్ఎస్ నిర్వహిస్తున్న ప్రగతి నివేదన సభ సందర్భంగా సీఎం కేసీఆర్ వస్తుండడంతో మండల వ్యాప్తంగా వివిధ రాజకీయ పార్టీ నాయకులను, ప్రజా సంఘాల నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. మండల వ్యాప్తంగా కాంగ్రెస్, బీజేపీ, న్యూడెమోక్రసీ, తెలంగాణ జనసమితి, జనసేవా సమితి నాయకులను అరెస్టు చేశారు.

నూతనకల్ : మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడం అక్రమమని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. అభివృద్ధి కేవలం మంత్రి జగదీష్‌రెడ్డి, ఆయన అనుచరులకు మాత్రమే జరిగింది తప్పా సామాన్యులకు ఒరిగింది ఏమీ లేదని ఆయన తెలిపారు. అరెస్టయిన వారిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బొడ్డుపల్లి అంజయ్య, మొగుళ్ల వెంకన్న, బండపల్లి సాగర్, నకిరేకంటి మధు, ముత్యం ప్రసాద్, జూలూరి కేశవచారి, నెల్లుట్ల మహేష్, కందుకూరి శ్రీకాంత్, దొండుగుల లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

నాగారం : సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరిగే సీఎం కేసీఆర్ ప్రగతి నివేదన సభను అడ్డుకునేందుకు వెళ్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులను పోలీసులు ఆదివారం ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యిందని, అధికార పార్టీకి పోలీసులు తొత్తులుగా మారారని విమర్శించారు. అరెస్టయిన వారిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎల్మకంటి సోమన్న, జాజుల వీరయ్య, ఎస్‌కె.వలీ, ఎస్‌కె.హుస్సేన్, అక్బర్‌పాష, కొలిపాక సాయికుమార్, నాగుల్‌మీరా, నరేష్, బషీర్, నాగరాజు, షరీఫ్ తదితరులు ఉన్నారు.